ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 20 సెప్టెంబరు 2024

3 దుకాణాలకు 36 బెల్టు షాపులు

- అవనిగడ్డ నియోజకవర్గంలో మద్యం మాఫియా
- ప్రభుత్వ దుకాణాల నుంచి బెల్టుషాపులకు సరఫరా
- ఓ అధికారి కనుసన్నల్లోనే వ్యవహారం

అవనిగడ్డ నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోంది. మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్టుగా నియోజకవర్గంలో మూడు ప్రభుత్వ మద్యం దుకాణాల పరిధిలో 36 బెల్టు షాపులు యథేచ్ఛగా సాగుతున్నాయి. వీటిని అరికట్టాల్సిన అధికారులే మద్యం షాపు నుంచి నేరుగా సరఫరా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ అధికారి కన్నుసన్నల్లో జరుగుతున్న ఈ అక్రమంపై ప్రత్యేక కథనం..


నాగాయలంక మద్యం దుకాణం పక్కనే బెల్టు షాపు

అవనిగడ్డ : నియోజకవర్గ కేంద్రమైన అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూడేసి చొప్పున ఉన్నాయి. నాగాయలంకలోని మూడు మద్యం దుకాణాలకు 22 పంచాయతీలు, వాటి శివారు గ్రామాలను కలుపుకుని 36 బెల్టు షాపులు నడుస్తున్నాయి. ఇదే పరిస్థితి అవనిగడ్డ, కోడూరు మండలాల్లోనూ ఉంది. నాగాయలంకలో ప్రభుత్వ మద్యం షాపు దగ్గర్లోనే బెల్టుషాపులు పెట్టి మద్యం అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. నాగాయలంకలోని స్వప్న థియేటర్ ఆవరణలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉంటే దానికి సరిగ్గా 40 అడుగుల దూరంలోనే రెండు బెల్టుషాపుల్లో 24 గంటలు మద్యం అమ్మకాలు చేస్తున్నారని మందుబాబులు వాపోతున్నారు. ప్రభుత్వ దుకాణాల్లో బ్రాండెడ్ మద్యం దొరకటం లేదని, బెల్టుషాపుల్లో మాత్రం పుష్కలంగా ఉన్నాయని చెబుతున్నారు.

ధరలు పెంచి అమ్మకం

మద్యం క్వార్టర్‌కు రూ.50 ఎక్కువ చెల్లించాల్సి వస్తోందని మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల కిందట నాగాయలంకలోని ఓ బెల్టుషాపు వద్ద మందుబాబులకు, నిర్వాహకులకు మధ్య గొడవ జరిగి పోలీస్ స్టేషన్ వరకు వెళ్లారు. అయినా ఆ దుకాణంలో మద్యం అమ్మకాలు నేటికీ యథావిధిగానే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని అమల్లోకి తీసుకురానున్న నేపథ్యంలో నియోజకవర్గానికి చెందిన ఓ అధికారి రంగంలోకి దిగి మద్యం దుకాణంలో పని చేసే సిబ్బందిని కొరియర్లుగా మార్చి బెల్టు షాపుల వ్యాపారం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు.

కూల్‌డ్రింక్ షాపులనూ వదలకుండా..

ప్రభుత్వ మద్యం దుకాణాల సమీపంలో ఉండే బడ్డీ కొట్లు, కూల్‌డ్రింక్ షాపుల వద్ద మందుబాబులు వాటర్ ప్యాకెట్లు కొనుగోలు చేసి ఆ పక్కనే మద్యం తాగుతుంటారు. ఇది గమనించిన సదరు అధికారి కూల్‌డ్రింక్ షాపుల వద్ద మామూళ్ల వసూళ్ల చేయడం వివాదాస్పదంగా మారింది. కూల్ డ్రింక్ షాపు వద్ద ఖాళీ మద్యం సీసాల మూతలు కనిపించాయంటూ ఓ దుకాణం యజమాని నుంచి రూ.7 వేలు డిమాండ్ చేయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ విషయం నాగాయలంక మండలంలో చర్చనీయాంశంగా మారింది. బెల్టు షాపుల వ్యవహారంపై ఎక్సైజ్ సీఐ సత్యనారాయణను వివరణ కోరగా, బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే దుకాణాల ద్వారా వెళ్లే మద్యాన్ని దాదాపుగా నిలుపుదల చేశామని, కొద్ది రోజుల్లోనే ఎక్సైజ్ పాలసీ వస్తున్నందున బెల్టుషాపులు ఉండవన్నారు. బెల్టుషాపుల నిర్వహణలో తమ సిబ్బంది పాత్ర ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా హోంగార్డుల విభాగంలో వసూళ్ల దందాకు అంతులేకుండా పోతోంది. సాక్షాత్తూ ఎస్పీ కార్యాలయం ఆవరణలోని జిల్లా హోంగార్డుల విభాగాన్ని వేదికగా చేసుకుని కొనసాగుతున్న వసూళ్ల పర్వానికి ఎలా బ్రేక్ పడుతుందనే అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. హోంగార్డులను వేరే సంస్థల్లోకి ఆన్‌పేమెంట్ పద్ధతిపై డ్యూటీ వేయాలంటే ఇంతరేటని నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడటం వివాదాస్పదమవుతోంది. ఎవరైనా హోంగార్డులు తమకు ఆన్‌పేమెంట్ డ్యూటీ వేయాలని వెళితే వారు కోరుకున్న విభాగాన్ని బట్టి నగదు చెల్లించాలని ముందుగానే చెబుతున్నారు. ఆరు నెలలపాటు డ్యూటీ నిమిత్తం అడిగినంత నగదు చెల్లిస్తే వెంటనే డ్యూటీలు వేయడం ఇక్కడ రివాజుగా మారింది.

మైనింగ్‌కు వెళ్లాలంటే రూ.1.50 లక్షలు

జిల్లాలో మైనింగ్ విభాగంలో హోంగార్డులకు డ్యూటీ వేయాలంటే ఆరు నెలలకు కనీసంగా ఒక్కో హోంగార్డు నుంచి రూ.1.50 లక్షల చొప్పున వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలుగా విడిపోయినా హోంగార్డులకు మాత్రం మచిలీపట్నాన్ని కేంద్రంగా చేసుకుని పరిపాలన కొనసాగిస్తున్నారు. ఇబ్రహీంపట్నం (తుమ్మలపాలెం) చెక్‌పోస్టుతోపాటు, జిల్లాలోని ఇసుకరేవుల వద్ద, క్వారీలు అధికంగా ఉండే ప్రాంతాల్లో డ్యూటీలు వేయాలంటే ఇంత పెద్దమొత్తంలో నగదు చెల్లించాలని పట్టుబట్టడం ఆనవాయితీగా మారింది.



హోంగార్డుల విభాగంలో ధనకార్యాలు!

ఆన్‌పేమెంట్ పద్ధతిపై డ్యూటీకి ఇష్టారీతిన మామూళ్లు

- ఎఫ్‌సీఐ, రవాణా విభాగాల్లో ఆరు నెలల విధులకు రూ.15 వేలు ఇవ్వాలట
- మైనింగ్ విభాగానికెళ్లాలంటే రూ.లక్షన్నర
- ఎస్పీ కార్యాలయం ఆవరణలోని హోంగార్డుల విభాగం కేంద్రంగా దందా

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 750 మందికిపైగా హోంగార్డులు పనిచేస్తున్నారు. వీరిలో 550 మంది బందోబస్తు విధుల్లో, పోలీస్‌స్టేషన్‌లలో, ఇతరత్రా విధుల్లో పనిచేస్తూ ఉంటారు. అత్యవసర పరిస్థితిలో జిల్లాలో ఎక్కడికైనా విధుల నిమిత్తం వీరిని పంపుతూ ఉంటారు. వీరికి కనీసం ప్రయాణ చార్జీలు కూడా ఇవ్వరు. ఆన్‌పేమెంట్ పద్ధతిపై ఓఎన్‌జీసీ, ఎఫ్‌సీఐ, ఎస్‌డబ్ల్యూసీ, రవాణాశాఖ, ఫైర్, రైల్వే, మైనింగ్ తదితర విభాగాల్లో పని చేసేందుకు హోంగార్డులను ఆన్‌పేమెంట్ పద్ధతిలో కేటాయిస్తారు. వీరికి ఈ సంస్థల ద్వారానే జీతాలు చెల్లిస్తారు. ప్రతి ఆరు నెలలకు ఓసారి హోంగార్డులకు డ్యూటీలు మారుస్తూ ఉంటారు. ఒక సంస్థలో పనిచేసే హోంగార్డులకు మళ్లీ ఆరు నెలల తరువాత అదే డ్యూటీ చేయాలంటే సంబంధిత కార్యాలయంలో కప్పం కట్టాల్సిందే. హోంగార్డులకు డ్యూటీలు వేయాలంటే ఆయా విభాగాల వారీగా ఒకరేటును నిర్ణయించారు. కనీసంగా రూ.15వేలు చెల్లిస్తేనే డ్యూటీలు వేస్తామని కరాఖండిగా చెబుతున్నారు. ఇటీవల కాలంలో కొంతమంది హోంగార్డులు జిల్లాకు చెందిన శాసనసభ్యులు, మంత్రులు, ఎంపీల ద్వారా సిఫార్సు లేఖలు తీసుకుని తమకు ఆన్‌పేమెంట్ పద్ధతిలో వేరే విభాగాలకు డ్యూటీలు వేయాలని హోంగార్డు కార్యాలయానికి వెళ్లారు. ఎంతపెద్దవారు సిఫార్సు లేఖలు ఇచ్చినా తాము నిర్ణయించిన మేర తాంబూలం ఇస్తేనే డ్యూటీలు వేస్తామని చెప్పి మరీ నగదు తీసుకోవడంతో ఆనోటా, ఈనోటా ఈ విషయం బయటకు పొక్కింది. ఎవరైనా హోంగార్డులు సకాలంలో అధికారులను కలవకుంటే ఫోన్‌చేసి మీకు డ్యూటీలు వేయకుండా చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో హోంగార్డులు బెంబెలెత్తిపోతున్నారు.

కానిస్టేబుల్, ఆర్ఎస్ఐ తెరవెనుక బేరాలు

మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, గన్నవరం సబ్‌డివిజన్‌లలో పనిచేసే హోంగార్డులు వివిధ విభాగాల్లో ఆన్‌పేమెంట్ పద్ధతిపై పనిచేసేందుకు వెళ్లాలంటే మచిలీపట్నంలోని కార్యాలయానికి వచ్చి డ్యూటీలు వేయించుకోవాల్సి ఉంది. ప్రతి సబ్‌డిజన్‌కు ఒక హెడ్‌కానిస్టేబుల్ ఉండి హోంగార్డులకు డ్యూటీలు వేసే పనులు చేస్తూ ఉంటారు. ఇటీవల కార్యాలయంలో పనిచేసే కానిస్టేబుల్, ఆర్ఎస్ఐ నేరుగా హోంగార్డులకు డ్యూటీలు వేసే విషయంలో తెరవెనుక బేరాలు కుదుర్చుకుని గుట్టుచప్పుడు కాకుండా నగదు వసూలు చేసుకుంటున్నారని హోంగార్డులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. మైనింగ్ విభాగంలో డ్యూటీలు వేసే అంశంలో పెద్దఎత్తున నగదు వస్తుండటంతోపాటు, అధికంగా నగదు ఇచ్చిన వారికే డ్యూటీలు వేస్తుండటం గమనార్హం.

ఆ ఇద్దరూ.. ఏళ్లతరబడి ఇబ్రహీం చెక్‌పోస్టు వద్దే..

మచిలీపట్నానికి చెందిన ఇద్దరు హోంగార్డులు ఇబ్రహీంపట్నం (తుమ్మలపాలెం) చెక్‌పోస్టు వద్ద ఏళ్లతరబడి విధులు నిర్వహించడం గమనార్హం. ఒకహోంగార్డు 10 చక్రాల లారీలను ఏడింటిని కొనుగోలు చేసి, వాటిని తిప్పుతూ మైనింగ్ విభాగంలోనే విధులు నిర్వహిస్తున్నాడని హోంగార్డులు చెప్పుకుంటున్నారు. మరో హోంగార్డు లారీ యజమానుల నుంచి రోజువారీ, నెలవారీ మామూళ్లు వసూలు చేసేందుకు ప్రైవేటుగా ఇద్దరు ఉద్యోగులను నియమించుకుని దందా నడుపుతూ ఎవరి వాటాలు వారికి అందజేస్తున్నాడని హోంగార్డులు అంటున్నారు. ఈ ఇద్దరు హోంగార్డులను మాత్రం అక్కడి నుంచి కదపకపోవడం గమనించదగ్గ అంశం. హోంగార్డులకు డ్యూటీలు వేసే విషయంలో జిల్లాస్థాయి అధికారి దృష్టి సారించి విచారణ చేయిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని హోంగార్డులు చెప్పుకుంటున్నారు.

నాటి పాపాలే.. నేడు శాపాలై..


పక్షం రోజులపాటు వరద నీటిలో నానిన వరి పొలాలు (ఫైల్)

> వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. డ్రెయిన్‌ల నిర్వహణ, పూడిక తొలగింపు, పేరుకుపోయిన చెత్త, తూడు నివారణలో తీవ్ర నిర్లక్ష్యం వహించింది. దీని మూలంగానే ఇటీవల కురిసిన వర్షాలకు బుడమేరు ఉగ్రరూపం దాల్చింది. అనేక గ్రామాలను ముంచెత్తింది. పంటలను సర్వనాశనం చేసింది. రైతులకు నష్టాన్ని మిగిల్చింది. దీని ఫలితంగా ఒక్క గుడివాడ నియోజకవర్గంలోనే 8300 ఎకరాల్లో వరి పూర్తిగా దెబ్బతిన్నది.

- గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వరి పంట నీటిపాలు
- బుడమేరు ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడమే కారణం
- డ్రెయిన్లలో చెత్త, తూటుకాడ తొలగింపు పనులు శూన్యం
- దిగువక ప్రవహించేమార్గం లేక ఎగదన్నిన వరద
- గుడివాడ నియోజకవర్గంలో 8300 ఎకరాల్లో వరికి నష్టం

ఆంధ్రజ్యోతి - గుడివాడ : బుడమేరులోని ఆక్రమణల తొలగింపులో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ఇటీవల వేలాది ఎకరాల్లో వరి పంట నీటి పాలైంది. ఆగస్టు నెలాఖరు, సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు గుడివాడ నియోజకవర్గ పరిధిలో 8300 ఎకరాల్లో వరి దెబ్బతిన్నది. పక్షం రోజులపాటు పంట పొలాలు వర్షపు నీటితో చెరువులను తలపించాయి.

డ్రెయిన్లలో పూడిక తీయని గత ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వం డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడికను తీయడంలో విఫలమైంది. ఒక్కపైసా కూడా ఖర్చు చేయకుండా కాలం వెళ్లదీశారు. గుడ్లవల్లేరు మండలంలోని పెంజెంద్ర, వడ్లమన్నాడు గ్రామాల్లో భారీగా వరి పంట దెబ్బతిన్నది. పాలకోడు డ్రెయిన్, వడ్లమన్నాడు డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడికను తీయకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో రైతులు భారీగా నష్టపోయారు. దోకిపర్రు, శేరీకల్వపూడి, అంగలూరు గ్రామాల్లో పాక్షికంగా వరిపైరుకు నష్టం వాటిల్లింది. గుడివాడ మండలం తట్టివర్రు, సీపూడి శివారు చినవానిగూడెం, రామనపూడి, దొండపాడు, చిలకమూడి, వలివర్తిపాడు, మల్లాయిపాలెం గ్రామాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా డ్రెయిన్‌లలో పూడికను తొలగించకపోవడంతో ఇంతటి నష్టం వాటిల్లింది.

దిగుబడి ప్రశ్నార్థకం

భారీ వర్షాలకు నీటమునిగి వరి కుళ్లిపోయింది. తిరిగి పంట వేసే అదును కూడా లేదు. మిగిలిన వరి పంట సైతం అనుకున్న స్థాయిలో దిగుబడి వచ్చే సూచనలు లేవు. వరి సరిగ్గా చేత చేసే సమయానికి వర్షాలు కురవడంతో పంట దిగుబడిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపుగా సగం మేర పంట దిగుబడి తగ్గుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. తిరిగి పంటను వేద్దామంటే అదునుగా కూడా లేదు. అక్టోబర్ 15 నాటికి వరి కంకి దశకు చేరుకుంటుంది. దీంతో తిరిగి పంట వేసే సమయం కూడా లేదు. వెంటనే రెండో పంట (ఆరుతడి పంట) వేసే సమయం కూడా దగ్గరలోనే ఉంది.

నట్టేటా ముంచిన బుడమేరు

బుడమేరు ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో నందివాడ మండలంలో 3352.5, పెదపారుపూడి మండలంలో 3272.5 ఎకరాల వరి పంట నీట మునిగింది. నందివాడ మండలంలోని పెదలింగాల, చినలింగాల, చేదుర్తిపాడు, ఒద్దుల మెరక, పుట్టగుంట, తమిరిశ, తుమ్మలపల్లి, నందివాడ, జనార్దన పురం గ్రామాలు, పెదపారుపూడి మండలంలోని మోపర్రు, వింజరంపాడు గ్రామాలను బుడమేరు ముంచెత్తింది. పెదపారుపూడి మండలంలో పెదపారుపూడిలో వరి పంట కుళ్లిపోయింది.

టెన్షన్.. టెన్షన్

- కాదంబరి కేసులో మిగిలిన అధికారులకు పిలుపులు
- మరో ఐదుగురు పోలీసులపై అభియోగాలు
- **వారిలో ఒకరు మహిళా ఎస్ఐ**
- వాంగ్మూలం తీసుకునే యోచనలో అధికారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ముంబయి నటి కాదంబరి జెత్వాని కేసు చాలామంది పోలీసు అధికారులను టెన్షన్‌కు గురిచేస్తోంది. ఇబ్రహీంపట్నం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీతో పాటు డీఎస్పీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్, సత్యనారాయణ, ఎస్ఐలు దుర్గాదేవి, షరీఫ్, షబానా, మౌనిక, గీతాంజలి పేర్లను పేర్కొన్న విషయం తెలిసిందే. వారిలో ముగ్గురు ఐపీఎస్‌లు, డీఎస్పీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను ఇప్పటికే సస్పెండ్ చేశారు. వీరిలో విశాల్‌గున్నీ రాతపూర్వకంగా వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసిందే. నాడు కేసు నమోదుకు సంబంధించి అప్పటి ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ వాంగ్మూలాన్ని విచారణాధికారి తీసుకున్నారు. మరో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ విజయవాడ కమిషనరేట్‌లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్ఐ షరీఫ్ మాత్రం గుడివాడ జీఆర్పీలో పనిచేస్తున్నారు. కాదంబరి నోటి నుంచి వచ్చిన పేర్లకు సంబంధించిన విచారణలో భాగంగా వాంగ్మూలం తీసుకునే అవకాశాలున్నాయి. విజయవాడ కమిషనరేట్‌లో ఉన్న వారిని మినహాయిస్తే ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని పిలిపించే సూచనలు కనిపిస్తున్నాయి.


కాదంబరి జెత్వాని

ఆ ఇద్దరు పోలీసులెవరు?

జెత్వానీ అరెస్టు ఆపరేషన్‌కు సంబంధించి ఒక అదనపు ఎస్పీ, ఇన్‌స్పెక్టర్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అదనపు ఎస్పీ గుంటూరు జిల్లాలో పనిచేస్తుండగా, ఇన్‌స్పెక్టర్ మాత్రం ఏలూరు రేంజ్‌లో ఉన్నారు. కాదంబరి కొన్ని పేర్లు చెబుతున్నప్పటికీ.. మరికొంతమంది పేర్లు తనకు తెలియవని, వ్యక్తులను గుర్తుపడతానని ఆమె పేర్కొంటున్నారు. హోంమంత్రి అనితను గురువారం కలిసినప్పుడు తనపై అన్యాయంగా కేసు నమోదు చేసి, అరెస్టు చేసిన ప్రతి ఒక్కరిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. కాదంబరి చెప్పిన వారి పాత్రలను నిర్ధారించే పనిలో విచారణాధికారి ఉన్నారు. అయితే, పాత్రధారులు ఎక్కడున్నా వచ్చి వాంగ్మూలం ఇవ్వాల్సిందేనని ఓ పోలీసు అధికారి తెలిపారు. కాంతిరాణా పోలీసు కమిషనర్‌గా ఉన్నప్పుడు ఎస్ఐ షరీఫ్ చేసిన వ్యవహారాలపైనా పోలీసు అధికారులకు అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో షరీఫ్ వ్యవహారం చర్చనీయాంశమైంది. ఆపరేషన్‌కు సంబంధించి ప్రధానమైన అధికారులను సస్పెండ్ చేశారు కాబట్టి తమ జోలికి ఎలాంటి క్రమశిక్షణ చర్యలు రావన్న భావనలో ఈ పోలీసులు ఉన్నారు. విచారణ పూర్తై, పాత్ర తేలిన వెంటనే చర్యలు ఉంటాయని పోలీసు అధికారులు చెబుతున్నారు.

వైసీపీకి సామినేని గుడ్‌బై

- 22న జనసేన పార్టీలో చేరిక
- నేడు జగ్గయ్యపేటలో కార్యకర్తలతో భేటీ
- ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు అప్పగించే అవకాశం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/జగ్గయ్యపేట) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో వైసీపీకి బలమైన దెబ్బ తగిలింది. కాపు సామాజికవర్గానికి చెందిన బలమైన నాయకుడిగా గుర్తింపు ఉన్న జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఈనెల 22న జనసేనలో చేరనున్నారు. ఇప్పటికే వైసీపీకి రాజీనామా చేసిన ఆయన.. గురువారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో అధినేత పవన్ కల్యాణ్‌తో సుమారు అరగంటపాటు భేటీ అయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జగ్గయ్యపేటలో అభిమానులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. తనతో కలిసొచ్చే వారిని జనసేనలోకి ఆహ్వానించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్, వైసీపీ తర్వాత..

ఉదయభాను 1999లో తొలిసారి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004, 2019లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో, గత వైసీపీ ప్రభుత్వంలోనూ ప్రభుత్వ విప్‌గా చేశారు. గురువారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయానికి వెళ్లిన సామినేని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో అరగంటపాటు భేటీ అయ్యారు. జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. జగన్ విధానాలు నచ్చక వైసీపీని వీడుతున్నట్టు చెప్పారు. 'వైసీపీలో పరిస్థితి చాలా కష్టంగా ఉంది. నా మనసుకు కష్టం కలిగింది కాబట్టి పార్టీ వీడాను. వైఎస్‌తో ఎంతో సన్నిహితంగా పనిచేశాను. ఆయన కుమారుడితోనూ అదే కమిట్‌మెంట్‌తో కలిసి నడిచాను. ఎన్నికల ముందు జగన్‌ను కలిసి పరిస్థితి చెప్పినా పట్టించుకోలేదు. వైసీపీలో జరుగుతున్న పరిణామాలు చూస్తే ఆ పార్టీకి భవిష్యత్తు లేదని స్పష్టమవుతోంది. 22న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో జనసేనలో చేరనున్నాను' అని ఉదయభాను ప్రకటించారు.



ఎన్టీఆర్ జిల్లా జనసేన బాధ్యతలు

కాపు సామాజికవర్గం నాయకుల్లో బలమైన నేతగా ఉన్న ఉదయభాను రాకతో ఎన్టీఆర్ జిల్లా జనసేనలో జోష్ పెరగనుంది. ఉదయభానుకు కాపు సామాజికవర్గంలో ఉన్న పట్టు కారణంగా ఆయనకు ఎన్టీఆర్ జిల్లా జనసేన బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. పార్టీ సభ్యత్వం ముగియడంతో ప్రస్తుతం జిల్లా అధ్యక్షుల నియామకంపై జనసేన అధిష్ఠానం దృష్టి సారించింది. ఈ తరుణంలో ఉదయభాను పార్టీలో చేరనుండటం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్‌ను తీసుకొచ్చింది.

ఉప్పునీరు ముంచుతోంది!

- అవుట్ ఫాల్ నిర్మాణం జరిగేదెన్నడో
- నీరు పొలాల్లోకి చొరబడి తీవ్ర నష్టం
- రైతుల కడగండ్లు తీర్చే నాథుడెవరు..


విరిగిపోయిన అవుట్ ఫాల్ స్లూయిస్ గేటు

4లో..

ఏటీఎం ధ్వంసం

- రూ. 2 లక్షల నగదు దగ్ధం

4లో..

గణేశ్ నిమజ్జనంలో ఘర్షణ

ఐదుగురికి గాయాలు

రుణాలు రీ షెడ్యూల్ చేసుకోండి

» వరద ముంపు ప్రాంత ప్రజలకు ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి నివాస్ సూచన

కృష్ణలంక, సెప్టెంబరు 19 : వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు లబ్ధిచేకూర్చేందుకు బ్యాంకుల రుణాల రీ షెడ్యూలింగ్ సౌకర్యాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని, వినియోగరుణాలు, కొత్త మూలధన రుణాలు పొందేందుకు వీలున్న నేపథ్యంలో బ్యాంకులకు దరఖాస్తులు సమర్పించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, కలెక్టర్ జి.సృజన సూచించారు. గురువారం లీడ్ బ్యాంక్ యూబీఐ అధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జె.నివాస్, కలెక్టర్ సృజన, బ్యాంకర్లు, బీమా సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ముంపు బాధితులకు భరోసా కల్పించేలా, బ్యాంకులు విజయవాడ పరిసర ప్రాంతాల ప్రజలకు సేవలందించాలని కోరారు. ఏడాది మారటోరియంతో రుణాల రీ షెడ్యూలింగ్‌తో పాటు ముంపు బారిన పడిన గ్రౌండ్‌ఫ్లోర్ కుటుంబాలకు రూ.50 వేలు, మొదటి, ఆపై అంతస్తులలో వున్న కుటుంబాలకు రూ.25 వేల వినియోగ రుణాలు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా ఈ రుణాలకు మూడు నెలల మారటోరియం, 36 నెలల రీ పేమెంట్ పీరియడ్ వర్తిస్తుందన్నారు. చిన్న వ్యాపార, వాణిజ్య సంస్థలకు తమ అవసరాలకు అనుగుణంగా పెట్టుబడికోసం కొత్త రుణాలు కూడా మంజూరు చేయాలన్నారు. సహజ విపత్తు ప్రభావిత జిల్లాకు ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం అన్ని సహాయసహకారాలను అందించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. బల్క్ మెసేజ్‌లతో పాటు నేరుగా మాట్లాడి బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకొనేలా వరద ప్రభావిత ప్రాంత ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. నీటమునిగిన గ్రౌండ్ ఫ్లోర్‌లోని కుటుంబానికి రూ.25 వేలు చొప్పున, మొదటి, ఆపై అంతస్తులలోని కుటుంబానికి రూ.10 వేల చొప్పున పరిహారాన్ని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారని, దీనికి తోడు రుణాల రీ షెడ్యూల్, వినియోగ, కొత్త రుణాల మంజూరు ద్వారా బాధితులను కష్టాల నుంచి గట్టెక్కించవచ్చని పేర్కొన్నారు. విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఇన్సూరెన్సు ఫెసిలిటేషన్ కేంద్రం విజయవంతమైన నేపథ్యంలో ఇదే తరహాలో ప్రత్యేక బ్యాంకింగ్ సేవల ఫెసిలిటేషన్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయడం జరుగుతోందని జె.నివాస్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జె.నివాస్, కలెక్టర్ సృజన

త్వరితగతిన క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్..

వరద ప్రభావంతో దాదాపు 48 వేల వాహనాలు దెబ్బతిన్నాయని, నష్టం వాటిల్లిన ద్విచక్ర వాహనాలు, ఆటోలకు ఇప్పటికే నష్టపరిహారం ప్రకటించడం జరిగిందని, ఇదేవిధంగా ఇన్సూరెన్సు క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతోందన్నారు. చిన్నచిన్న రిపేర్లు అవసరమైన వాటిని బాగుచేయించే ప్రక్రియ రెండు, మూడురోజుల్లో పూర్తవుతుందన్నారు. ఎంఎస్ఎంఈలకు సంబంధించి అన్ని విధాలా అవసరమైన సహాయ సహకారాలు అందించడం జరుగుతోందని నివాస్ తెలిపారు.

బాధితులకు చేయూతనందించాలి : కలెక్టర్

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అధికార యంత్రాంగం అన్నివిధాలా సహకారం అందిస్తోందని, దీనికి బ్యాంకులు కూడా సమష్టి కృషితో బాధితులకు చేయూతనందించాల్సిన అవసరముందని కలెక్టర్ తెలిపారు. డీసీసీ, ఎస్ఎల్‌బీసీ వరుస సమావేశాలు, ముఖ్యమంత్రి మార్గనిర్దేశనం తదితరాలతో ప్రాథమికంగా ఖరారైన నిర్ణయాలను సమర్థవంతంగా అమలుచేసేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. బీమా సంస్థలకు అందిన క్లయిమ్‌లు, సెటిల్‌మెంట్‌లో పురోగతి తదితర అంశాలపైనా సమావేశంలో చర్చించారు. సమావేశంలో యూబీఐ రీజనల్ హెడ్ ఎం.శ్రీధర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక, వివిధ బ్యాంకులు, బీమా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

2019 కౌలు చట్టాన్ని సవరించాలి

» కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ

వన్‌టౌన్, సెప్టెంబరు 19 : భూ యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాన్ని ఇవ్వాలంటే 2019 చట్టాన్ని సవరించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, కార్యదర్శి ఎం.హరిబాబులు గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. భూ యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు హక్కుల పత్రాలు ఇవ్వటానికి మంత్రివర్గం ఆమోదం తెలపటం హర్షణీయమే కాని, ఇది అమలు కావాలంటే పంట సాగు హక్కు పత్రం-2019 చట్టాన్ని సవరించాలని, దానిని సవరించకుండా ముఖ్యమంత్రి కేవలం ప్రకటన చేయటం వల్ల సాధ్యం కాదన్నారు. దీని అమలుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. భూ యజమాని సంతకం తొలగించటంతో పాటు దీనికి సంబంధించి ఇంకా కొన్ని విధి విధానాలను రూపొందించాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు. రైతులు, కౌలు రైతుల సంఘాలు, వ్యవసాయరంగ నిపుణులు తదితరులతో సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకోవాలని, ఆమేరకు చట్టాన్ని పటిష్టంగా రూపొందించాలని కోరారు. గ్రామసభ ద్వారా కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పరిహారాలు, బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చట్టంలో పొందుపరచాలన్నారు. 2019 కౌలు చట్టాన్ని సవరించి చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తూ పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.



ఢిల్లీలో డెయిరీ కాన్ఫరెన్స్‌లో మీనేష్ షాను కలిసిన చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు

కృష్ణా మిల్క్‌ను ఆదుకోండి!

» నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్‌కు వినతి

చిట్టినగర్, సెప్టెంబరు 19 : వరద ముంపునకు గురైన కృష్ణామిల్క్ యూనియన్‌ను ఆదుకోవాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ, కొల్లి ఈశ్వరబాబులు గురువారం ఢిల్లీలో ఐసీఏఆర్ డెయిరీ కాన్ఫరెన్స్‌లో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ మీనేష్ షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల సంభవించిన వరదల కారణంగా కృష్ణామిల్క్ యూనియన్ విజయవాడ ఫ్యాక్టరీ పూర్తిగా ముంపునకు గురై అపార నష్టం వాటిల్లిందని మీనేష్ షాకు చలసాని ఆంజనేయులు, ఈశ్వరబాబులు వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మీనేష్ షా ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తమవంతు సహాయ సహకారాలు అందస్తానని హామీ ఇచ్చారన్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు దక్షిణ రీజియన్ హెడ్ జి.కిషోర్‌ను కూడా కలిసి వినతిపత్రం అందజేశారు.

నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు సవరించండి

విస్సన్నపేట : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు చెట్టు పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ.250 కోట్లను పాత పద్ధతిలో రైతులు, నీటి సంఘాల ప్రతినిధులు ఖాతాల్లో జమచేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి రైతు సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. సమస్యను సత్వరమే పరిష్కరించాలని వినతిపత్రంలో కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.



మంత్రి నిమ్మలకు వినతిపత్రం ఇస్తున్న నీటి సంఘాల నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

దసరా ఏర్పాట్లలో వీఎంసీ

» కమిషనర్ ధ్యాన చంద్ర సమీక్ష

చిట్టినగర్ : దసరా మహోత్సవాలకు వీఎంసీ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, క్లోక్ రూమ్‌లు, పారిశుధ్య నిర్వహణ తదితర అన్ని ఏర్పాట్లు సర్వం సిద్ధం చేస్తున్నామన్నారు. గుడి చుట్టూ రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా 35లక్షల తాగునీటి వాటర్ బాటిల్స్, ప్యాకెట్లు, 150 తాత్కాలిక మరుగుదొడ్లు, 6 క్లోక్ రూమ్‌లు, పారిశుధ్య నిర్వహణకు 27 ప్రాంతాల్లో 1400 మంది పారిశుధ్య కార్మికులతో మూడు షిఫ్ట్‌లలో ఏర్పాటు చేయటంతోపాటు, గిరిప్రదక్షిణ దారిలో ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



నారా లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న వసంత కృష్ణ ప్రసాద్

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.40 లక్షల విరాళం

జి.కొండూరు : విజయవాడ వరదబాధితుల సహాయర్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.40 లక్షల విరాళాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ద్వారా మంత్రి నారా లోకేశ్‌కు గురువారం అందజేశారు. ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ ప్రతినిధులు రూ.30 లక్షలు, ఏపీ కాటన్ మిల్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.10 లక్షలు చెక్కులను అందజేశారు.

యూపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

» హాజరుకానున్న 136 మంది అభ్యర్థులు

కృష్ణలంక, సెప్టెంబరు 19 : ఈనెల 20వ తేదీ శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు తిరిగి 28, 29 తేదీలలో ఐదు రోజులపాటు నిర్వహించే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలకు ఏర్పాట్లను పూర్తిచేసినట్టు డీఆర్వో వి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షల ఏర్పాట్లపై గురువారం డీఆర్వో వి.శ్రీనివాసరావు నగరంలోని కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో లైజనింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ లైజనింగ్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలను నగరంలోని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఈనెల 20, 21, 22, 28, 29 తేదీలలో ఐదురోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలకు 136 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ఈనెల 20వ తేదీ శుక్రవారం పేపర్-1 ఎస్సై పరీక్ష, 21వ తేదీన పేపర్-2 జనరల్ స్టడీస్-1, పేపర్-3లో జనరల్ స్టడీస్-2, 22వ తేదీన పేపర్-4, 28వ తేదీ పేపర్-ఏలో ఇండియన్ లాంగ్వేజ్, మధ్యాహ్నం పేపర్-బి ఇంగ్లీష్, 29వ తేదీ పేపర్-6లో ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-1, మధ్యాహ్నం పేపర్-7లో ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-2 పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణకు ఏడుగురు ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విభిన్న ప్రతిభావంతులు పరీక్షలు రాసేందుకు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు ఇద్దరు వెన్యూ సూపర్‌వైజర్లు, ఇద్దరు అసిస్టెంట్ సూపర్‌వైజర్లను నియమించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ముఖ్యంగా తాగునీరు, అవసరమైన మందులతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థుల హాల్ టిక్కెట్లలో పరీక్ష కేంద్రం పేరు అభ్యర్థి రాసే పరీక్ష కేంద్రం ఒకే విధంగా వుండేలా జాగ్రత్త వహించాలన్నారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఏపీఎస్ ఆర్టీసీ ఆయా రూట్లలో బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్వో వి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలపై జిల్లా రెవెన్యూ అధికారి, పరీక్షల కస్టోడియన్ అధికారి డీఆర్వో వి.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. సమావేశంలో యూపీఎస్సీ జాయింట్ సెక్రటరీ సంతోష్ అజ్మీరా, అండర్ సెక్రటరీ సుశీల్‌కుమార్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి, లెక్చరర్ తుంబురు ఆర్యపతి, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసరావు

రిజిస్ట్రేషన్ల డీఐజీగా రవీంద్రనాథ్ కొనసాగింపు

ఎన్టీఆర్‌జిల్లా డీఆర్ పీఎస్ఆర్ ప్రసాద్ ఐజీ కార్యాలయానికి బదిలీ

నూతన డీఆర్‌గా పీవీవీ దుర్గాప్రసాద్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రిజిస్ట్రేషన్ల శాఖలో బదిలీలు మొదలయ్యాయి. విజయవాడ జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)గా ఎ.రవీంద్రనాథ్‌ను యథాస్థానంలోనే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఆయన తిరిగి విజయవాడ డీఐజీగా మరికొంతకాలం పనిచేయనున్నారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్)గా పనిచేస్తున్న పీఎస్ఆర్ ప్రసాద్ బదిలీ అయ్యారు. ప్రసాద్‌ను తాడేపల్లిలోని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంపుల శాఖ ఐజీ కార్యాలయంలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఏఐజీ)గా నియమించారు. ప్రసాద్ బదిలీతో ఖాళీ అయిన స్థానాన్ని మచిలీపట్నం డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ (డీఆర్) పీవీవీ దుర్గాప్రసాద్‌ను ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్)గా నియమించారు.

క్రైం కార్నర్

ఏటీఎం ధ్వంసం

» రూ. 2 లక్షల నగదు దగ్ధం

మచిలీపట్నం టౌన్ : ఇనగుదురులో గురువారం తెల్లవారుజామున దుండగులు ఏటీఎంను ధ్వంసం చేసి నగదు అపహరించేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. దుండగుల ప్రయత్నంలో రూ. 2 లక్షల నగదు దగ్ధమైంది. ఎస్ఐ బేగ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇనగుదురుపేటలో యాక్సిస్ బ్యాంకుకు చెందిన ఏటీఎంను కొందరు దుండగులు కట్టర్‌తో బాక్సును కట్ చేసి నగదు అపహరించే ప్రయత్నం చేశారు. అంతలో స్థానికులు రావడంతో పారిపోయారు. అయితే కట్టర్ వేడికి లోపల బాక్సులో ఉన్న రూ. 2 లక్షలు నగదు పాక్షికంగా దగ్ధమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గణేశ నిమజ్జనంలో ఘర్షణ

» ఐదుగురికి గాయాలు

మోపిదేవి, సెప్టెంబరు 19 : నాగాయితిప్ప పంచాయతీ శివారు పోచిగానిలంకలో గణేశ్ నిమజ్జనోత్సవ ర్యాలీలో ఘర్షణ జరిగి ఐదుగురికి గాయాలైన ఘటన గురువారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి సేకరించిన సమాచారం మేరకు.. పోచిగానిలంక గ్రామానికి చెందిన ఒక సామాజిక వర్గానికి చెందిన వారు గణనాథుని నిమజ్జనోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డీజే ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన మోర్ల వెంకటేశ్వరరావు, సాయిరామ్‌లు ఇంటికి వెళ్తు డీజే వాహనం అడ్డంకిగా ఉండటంతో దారి ఇవ్వాలని కోరారు. దీంతో వారి మధ్య వివాదం తలెత్తి ఘర్షణకు దారితీసింది. దీంతో కమిటీ సభ్యులు గొడవ సర్దుబాటు చేశారు. సాయిరామ్ ఇంటికి వెళ్లిపోగా, ఊరేగింపు ఏర్పాటు చేసిన గరికపాటి అనిల్ మరో నలుగురితో కలిసి వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్లి వెంకటేశ్వరరావు, కొడుకు సాయిరామ్‌లపై దాడికి పాల్పడ్డారు. ఇరువర్గాలు కర్రలతో దాడి చేసుకోవటంతో వెంకటేశ్వరరావు, సాయిరామ్‌లకు తలపై తీవ్ర గాయాలయ్యాయి. అనిల్, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు కావటంతో ఇరువర్గాలకు చెందిన ఐదుగురు అవనిగడ్డ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘర్షణ నేపథ్యంలో సీఐ ఈశ్వరరావు గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.



వెంకటేశ్వరరావు, సాయిరామ్

న్యూస్ బాక్స్

వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉంగుటూరు : కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని అబ్దుల్‌కలాం నైపుణ్యశిక్షణాకేంద్రంలో ఈనెల 28నుంచి ప్రారంభంకానున్న ప్లంబర్, కారు, మోటార్‌సైకిల్ రిపేర్ విభాగాల్లో ఉచిత శిక్షణ పొందేందుకు ఆసక్తిగల అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వరదేశి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మూడునెలలపాటు పై మూడు కోర్సుల్లో శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. 10వ తరగతి చదివి, 18 నుంచి 35 మధ్యవయసు కలిగిన యువకులు అర్హులని తెలిపారు. శిక్షణాకాలంలో అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు ఏర్పాటుచేస్తామన్నారు. శిక్షణా నంతరం సర్టిఫికెట్లతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో సహాయ సహకారాలు అందించబడతాయన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతాల వారైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 9440925583, 9010423652 నెంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ పేర్కొన్నారు.

స్ట్రీట్ ఫర్నీచర్ బకాయిలన్నీ చెల్లించాం : ప్రకాశ్ ఆర్ట్స్

» క్రమం తప్పకుండా లీజు చెల్లిస్తున్నాం : లీడ్ స్పేస్

విజయవాడ : విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్ట్రీట్ ఫర్నీచర్‌కు సంబంధించిన లైసెన్సు ఫీజులన్నీ చెల్లించినట్టు ప్రకాశ్ ఆర్ట్స్ సంస్థ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. బకాయిలు ప్రతినెలా చెల్లిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పాత అడ్వర్టైజ్‌మెంట్ ఫీజు స్ట్రక్చర్ ఆధారంగా క్రమం తప్పకుండా లీజు మొత్తాలను చెల్లిస్తున్నామని లీడ్ స్పేస్ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. పాత అడ్వర్టైజ్‌మెంట్ ఫీజుస్ట్రక్చర్ ఆధారంగా తాము కేవలం రూ.2.5కోట్ల బకాయిలు మాత్రమే ఉన్నామని, 2018 నుంచి 250 శాతం ప్రకటనల రుసుంపై పన్ను పెంచడంతో అంత మొత్తం భరించడం చిన్నచిన్న ప్రకటనకర్తలకు సాధ్యం కాదని, గత రేటు ప్రకారం పన్నులు చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని లీడ్‌స్పేస్ యాజమాన్యం పేర్కొంది.

రెండు వర్గాల మధ్య ఘర్షణ ఏడుగురి అరెస్టు

జగ్గయ్యపేట : క్రిస్టియన్‌పేటలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గురువారం ఏడుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్టు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో టీడీపీ నేత కర్ల జోజి, వైసీపీ నేత రుంజా నాగేంద్ర వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో 19మందిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికకు చర్యలు

» అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వీసీలో జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికలో భాగంగా రానున్న ఐదేళ్లలో కృష్ణా జిల్లాలో చేపట్టే అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాలపై ప్రణాళికను తయారుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జేసీ గీతాంజలి శర్మ తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 ప్రణాళిక తయారీపై అమరావతి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ కలెక్టర్‌లు, జేసీలతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జేసీ, అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయం, అటవీ, పశుపోషణ, ఆక్వాకల్చర్, కోళ్ల పెంపకం, మైనింగ్ విభాగాలను తొలిప్రాధాన్యతగా గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలకు అంచనాలు తయారుచేస్తున్నట్టు జేసీ తెలిపారు. రెండో ప్రాధాన్యతగా క్వారీయింగ్, వివిధరకాల వస్తువుల తయారీ, మూడో ప్రాధాన్యతలో వాణిజ్యం, రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, విద్య, ఆరోగ్యం, పర్యాటక కేంద్రాల అభివృద్ధి, బీమా తదితర అంశాలను ఆధారంగా ప్రణాళికలు తయారుచేస్తున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, సీపీవో గణేష్‌కృష్ణ, జడ్పీ సీఈవో ఆనందకుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, పశసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ గీతాంజలిశర్మ, అధికారులు



నూజివీడు స్టేషన్‌కు ఎగుమతుల కళ

» 2672 టన్నుల ఉప్పు.. ప్రతీ నెలా గోధుమ, సోయాబీన్, మొక్కజొన్న దిగుమతి

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 19 : మామిడి ఎగుమతులతో విజయవాడ రైల్వేకు కోట్లాది రూపాయలు ఆర్జించిన నూజివీడు రైల్వే స్టేషన్‌లో దిగుమతుల కళ సంతరించుకుంది. గుజరాత్ నుంచి 2672 టన్నుల ఉప్పు నూజివీడు స్టేషన్‌లో గురువారం దిగుమతి అయ్యింది. గన్నవరం సమీపంలోని వేర్‌హౌస్‌కు ఓ ప్రైవేట్ కంపెనీ ఉప్పును బుక్ చేసుకుంది. మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామికవాడలోని సితార ఫుడ్ ఇండస్ట్రీ ప్రతినెల వేల టన్నుల గోధుమలను దిగుమతి చేసుకుంటోంది. గతనెలలో మూడు రైళ్లలో గోధుమలు, మొక్కజొన్న దిగుమతి అయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 10 రైళ్లలో దిగుమతులు జరిగాయి. జిల్లాలోని పలు చేపల పరిశ్రమలు కూడా ఇతర రాష్ట్రాల నుంచి సోయాబీన్ పిండిని దిగుమతి చేసుకుంటున్నాయి. స్టేషన్‌కు క్రమేణా దిగుమతుల కళ వస్తోంది. మరో రెండురోజుల్లో రెండు రేకులు(గూడ్స్ రైళ్లు) గోధుమలు, మొక్కజొన్న దిగుమతి కానున్నట్టు గూడ్స్ విభాగం అధికారులు తెలిపారు. వరుస దిగుమతులతో ముఠాకార్మికులకు ఉపాధి లభించడంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఉప్పు నీరు ముంచుతోంది!

» అవుట్ ఫాల్ నిర్మాణం జరిగేదెన్నడో

» నీరు పొలాల్లోకి చొరబడి తీవ్ర నష్టం

» అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

కోడూరు : ఏళ్ల గడుస్తున్నా అవుట్ ఫాల్ నిర్మాణం జరిగేదెన్నడో తెలియక ఉప్పునీటి బారి నుంచి పంట పొలాలకు రక్షణ కల్పించే నాథుడెవరని కోడూరు మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. 13వ నెంబర్ పంట కాలువ దిగువ ప్రాంతంలో బాడే కాలువ సమీప ప్రాంతంలోని నల్లపొర్ర పొలాల్లోకి కోడూరు అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్లు సరిగా లేని కారణంగా ఉప్పునీరు నేరుగా పంట పొలాల్లోకి చొచ్చుకు రావటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల వర్షాల తాకిడికి పంటలు నీటమునిగి వేసిన నాట్లు, నారుమడులు కుళ్లిపోగా, మరలా పంట వేసుకునేందుకు నారుమడులు సిద్ధం చేస్తే ఉప్పునీటి ముంపునకు గురై నష్టపోయే పరిస్థితి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడూరు అవుట్ ఫాల్ గేటు ఒకటి విరిగిపోగా, మరొకటి పూర్తిగా లేకపోవటంతో సముద్రపు ఆటుపోట్లకు అడ్డంకి లేక నేరుగా మురుగు కాలువల ద్వారా ఉప్పునీరు పొంగి పొర్లి పంట పొలాల్లోకి చేరుతుంది. ఈ విషయమై ఏళ్ల గడుస్తున్నా గత పాలకులు కాలయాపన చేశారని, ప్రస్తుత ప్రభుత్వం అయినా రైతుల గోడు పట్టించుకుంటుందనే ఆశతో ఎదురుచూస్తున్నప్పటికీ నిరాశే ఎదురవుతున్నదని రైతులు పేర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వానికి పలుమార్లు అవుట్‌పాల్ స్లూయిస్ గురించి అప్పటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా పరిశీలించి వెళ్లిపోయారు తప్ప సమస్య గురించి ఏనాడు పట్టించుకోలేదన్నారు. సముద్రపు ఆటుపోట్లు వస్తే మా బాధలు ఎవరికి చెప్పుకోలేని విధంగా ఉంటున్నాయని రైతులు తెలుపుతున్నారు. ఇదే తరహాలో పాలకాయితిప్ప అవుట్ పాల్‌స్లూయిస్ గేట్లు కూడా పూర్తిగా శిథిలం కావటంతో వేలాది ఎకరాల్లో గత నాలుగు సంవత్సరాలుగా పంట వేసే పరిస్థితి లేక రైతులు ఆందోళన చెందుతున్నప్పటికీ రైతుల సమస్యలు పట్టించుకునే నాథుడే లేక నేటికీ కొన్ని పంట పొలాలు బీడు భూములుగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత డ్రెయినేజీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి తాత్కాలిక రబ్బరు లేదా ఫైబర్ గేట్లు అమర్చి పంట పొలాల ముంపు నుంచి రక్షించాలని వేడుకుంటున్నారు. లేని క్రమంలో గ్రామాలు వదిలి పొట్టకూటి కోసం వలస వెళ్లాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.



అవుట్ ఫాల్ గేటు లేకపోవటంతో నేరుగా సముద్రపు ఉప్పు నీరు వస్తున్నదని చూపుతున్న రైతులు



అవుట్ ఫాల్ స్లూయిస్‌కు విరిగిపోయిన గేటు

డ్రెయినేజీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి : రైతులు

డ్రెయినేజీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమకు ఈ దుస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. అవుట్ పాల్ స్లూయిస్ గేట్లు పూర్తిగా లేనప్పటికీ ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించటం వల్లే ఉప్పు నీరు పంట పొలాల్లోకి వస్తున్నదని రైతులు బండే ఆంజనేయులు, చేబోయిన సుబ్బారావు, చేబోయిన చంటి, అడుసుమిల్లి సత్యనారాయణ, ఉల్లి చిరంజీవి ఆరోపించారు.



సాగు పరిస్థితి లేక బీడు భూములుగా మారిన పంట పొలాలు

పేదల కాలనీకి అరకొరగా తాగునీరు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 19: అరకొరగా సరఫరా అవుతున్న తాగునీటి కారణంగా నూజివీడు రైల్వేస్టేషన్ సమీపంలోని పేదల కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీవాసులకు తాగునీటి సమస్య తరచూ ఎదురవుతోంది. ఇటీవల కాలనీకి తాగునీరు అందించే బోరు పనిచేయక కొన్ని రోజుల పాటు నీరు అందలేదు. కాలనీలో మూడు బోర్లు ఉన్నప్పటికీ అరకొరగానే నీటిని అందిస్తున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ఒక బోరు పనిచేయలేదు. దీంతో కాలనీవాసులకు తాగునీరు అందడం లేదు. సమస్యపై గ్రామ పంచాయతీకి సమాచారం ఇచ్చినా అధికారులు సకాలంలో స్పందించడంలేదని కాలనీ వాసులు చెబుతున్నారు. కాలనీలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని పూర్తిస్థాయిలో తాగునీరందేలా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వనమహోత్సవంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, సెప్టెంబరు 19: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, వృక్షాలను మనం రక్షిస్తే అవి మనలను రక్షిస్తాయని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం గంగూరులో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, అక్బర్ బాషా, అబ్దుల్ సలాం, అబ్దుల్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.


వనమహోత్సవంలో భాగంగా గంగూరులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్


ఉయ్యూరు రాజర్షినగర్‌లో మొక్క నాటుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఈడుపుగల్లులో..

కంకిపాడు: ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆంధ్ర నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన ఊరు-మన స్వచ్ఛత-మన సంపద, వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విచ్చేశారు. 9 వేలకు పైగా మొక్కలు నాటిన యార్లగడ్డ పావనిని ఆయన సత్కరించారు. ఆంధ్ర నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. వెంకటేశ్వరరావు, దేవినేని రాజా, నెరుసు రాజ్యలక్ష్మి, పందిపాటి ఇందిర, ముప్పా రాజా, సుదిమళ్ల రవీంద్ర, పందిపాటి సుధాకర్, చిన్నబాబు, దేవినేని రత్నభూషన్, రావి సౌజన్య పాల్గొన్నారు. గోసాల గ్రామ పరిధిలో నిర్వహించిన వనమోహత్సవంలో ఎంపీడీవో సునీత శర్మ, ఈవో ప్రసాద్, నాయకులు కోనేరు సాంబయ్య, ఆంజనేయులు, సుభాని పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం

ఉయ్యూరు: పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు మొక్కలునాటి సంరక్షించడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని నగరపంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి పలుచోట్ల మొక్కలు నాటారు. నగరపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేయించారు. పౌష్టికాహార వారోత్సవాలను పురస్కరించుకుని మెప్మా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.


చలసాని ఆంజనేయులుకు బహుమతి అందజేస్తున్న దాసరి బాలవర్ధనరావు

పాడిరైతులకు ఆదర్శంగా చలసాని ఆంజనేయులు

- పాల సరఫరాలో తృతీయ స్థానం
- చైర్మన్‌ను అభినందించిన కృష్ణా మిల్క్‌యూనియన్ సభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 19: కృష్ణామిల్క్ యూనియన్‌కు పాలు సరఫరా చేయడంలో తృతీయ స్థానం సాధించిన యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పాడిరైతులకు ఆదర్శంగా నిలచారని యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పాడి రైతులకు, సేల్స్ ఏజెంట్లకు వివిధ విభాగాల్లో బహుమతులు అందజేశారు. కాకులపాడులోని పాల సొసైటీకి పాలు పోస్తూ యూనియన్ స్థాయిలో చలసాని ఆంజనేయులు మూడో స్థానం సాధించడంతో ఆయకు కూడా పాలకవర్గ సభ్యులు బహుమతి అందజేశారు. చలసానిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, పాలకవర్గ సభ్యులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


బుద్ధవరం ఆర్బీకే వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఏలూరు కాలువ గండిని పూడ్చాలి

గన్నవరం, సెప్టెంబరు 19: కేసరపల్లి వద్ద ఏర్పడిన ఏలూరు కాలువ గండిని యుద్ధప్రాతిపదికన పూడ్చాలని రైతు సంఘం మండల కార్యదర్శి సూరగాని సాంబశివరావు డిమాండ్ చేశారు. బుద్ధవరం ఆర్బీకే వద్ద రైతు సంఘం నాయకులు గురువారం ఆందోళన నిర్వహించారు. ఏలూరు కాలువకు ఏర్పడిన గండిని పూడ్చకపోవడం వల్ల నీరంతా పంట పొలాల మీదుగా ప్రవహిస్తోందని, వందల ఎకరాలు నీటి పాలయ్యాయని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. గండిని పూడ్చాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు. నక్కా రామయ్య, ఆదిశేషు, గండికోట దశరథరామయ్య, మల్లంపల్లి ఆంజనేయులు, నక్కా వెంకట్రామయ్య, బడుగు మరియదాసు పాల్గొన్నారు.


మహితకు నగదు అందిస్తున్న టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య

విద్యార్థినికి ఆర్థిక సాయం

కంకిపాడు, సెప్టెంబరు 19: విద్యార్థులు చదువుతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య అన్నారు. ఉప్పలూరు గ్రామానికి చెందిన ఉడతా మహిత డిగ్రీ మొదటి సంవత్సరం చదువుకోవడానికి నగదు లేక ఇబ్బంది పడుతోందని తెలుసుకున్న ఆయన రూ.11,000ను కొల్లి కిషోర్‌తో కలిసి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

- ఎస్‌బీఐ జీఎం శైలేష్ కుమార్

గన్నవరం, సెప్టెంబరు 19: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్యమని ఆ బ్యాంక్ జీఎం శైలేష్‌కుమార్ అన్నారు. కేసరపల్లిలో ఎస్‌బీఐ నూతన బ్రాంచ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. సైబర్ నేరాల పట్ల ఖాతాదారులు అవగాహన కలిగి ఉండాలని, ఫోన్‌కు వచ్చే బ్యాంక్ సంబంధిత ఓటీపీలు, ఇతర మెసేజ్‌లు, అపరచిత వ్యక్తులతో పంచుకోవద్దని ఆయన సూచించారు. ఏ సమస్యలు ఉన్నా వెంటనే బ్యాంకును సంప్రదిస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డీజీఎం మనీష్‌కుమార్ సింగ్, నార్త్ రీజనల్ మేనేజర్ ఆర్.రాఘవరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, రాజులపాటి ఫిలిప్, రమేష్ రాజు, రాధాకృష్ణమూర్తి, ప్రసాద్, రాజులపాటి శ్రీనివాసరావు, గన్నవరం బ్రాంచ్ మేనేజర్ మరియ బేగం తదితరులు పాల్గొన్నారు.


కేసరపల్లిలో నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ జీఎం శైలేష్ కుమార్

నిత్య కృషీవలుడు లింగమూర్తి

ఉయ్యూరు, సెప్టెంబరు 19: పారిశ్రామిక వేత్త, ఆర్యవైశ్య మహసభ ఉపాధ్యక్షుడు నూకల లింగమూర్తి నిత్య కృషీవలుడని, ఆయన సమాజానికి ఎనలేనివని సేవలు చేశారని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ అన్నారు. యాకమూరు సుధీర్ టింబర్ డిపో ఆవరణలో గురువారం నిర్వహించిన లింగమూర్తి సంస్మరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. లింగ మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు నూకల శేషగిరిరావు, సాంబశివరావుకు సానుభూతి తెలియ జేశారు. మహాసభ నాయకులు చెక్కా శెన్నకేశవరావు, మాటూరి రంగనాథ్, వెంట్రప్రగడ వీరాంజనేయులు, జిల్లా నాయకులు గంగరాజు, నాగరాజు, శ్రీనివాస్, ప్రసాద్, మాజేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.


నూకల లింగమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ



స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పెనమలూరు, సెప్టెంబరు 19: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు వచ్చేనెల ఒకటి వరకు నిర్వహించే స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత కార్యక్రమాన్ని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. అందులో భాగంగా గురువారం కళాశాల వైస్ చాన్స్‌లర్ వెంకటేశ్వరరావు కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సింగిల్ యూజ్ పాత ప్లాస్టిక్ వస్తువులను ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేకరించడం, స్వచ్ఛ క్లాస్‌రూం, స్వచ్ఛ హాస్టల్, స్వచ్ఛ క్యాంపస్, గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దడం, పబ్లిక్ స్థలాలను శుభ్రం చేయడం, సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించడం, విద్యార్థులకు వివిధ పోటీల నిర్వహించడం వంటి కార్యక్రమాలను నెహ్రూ యువకేంద్రంతో కలిసి చేస్తామని కార్యక్రమ అధికారి కొల్లా నరేంద్ర పేర్కొన్నారు. రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే షటిల్ పోటీలు

గన్నవరం, సెప్టెంబరు 19: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 20 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయిలో మూడు రోజుల పాటు షటిల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ కేవీ రమణ తెలిపారు. షటిల్ పోటీల కరపత్రాలను అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్ కిషోర్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. కిషోర్ సౌజన్యంతో క్రీడాకారులకు టీషర్టులను గురువారం అందజేశారు. వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు రూ.60వేలు నగదు బహుమతులతో పాటు షీల్డ్స్ అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభిస్తారని కిషోర్ తెలిపారు. సీహెచ్ చంద్ర శేఖర్, రామారావు, నిడమర్తి బుజ్జారావు, రవివర్మ, బట్టు రుషి, ప్రభు, నళినీకుమార్ పాల్గొన్నారు.


షటిల్ పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేవీ రమణ, కేవీఆర్ కిషోర్

వరదలకు నష్టపోయిన
రైతులను ఆదుకోవాలి

- ప్రభుత్వానికి సీపీఎం, రైతు సంఘం విజ్ఞప్తి

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 19: బుడమేరు వరద ముంపు కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని సీపీఎం, ఏపీ రైతు సంఘం బాపులపాడు మండల నాయకులు జేత శ్రీనివాసరావు, తోట సాంబశివరావు గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కంటి తుడుపుచర్యగా వరికి ఎకరానికి రూ.10 వేలు, అపరాలకు రూ.6 వేలు, కూరగాయ పంటలకు రూ.4వేలు ప్రకటించడం అన్యాయమని వారు పేర్కొన్నారు. వరి సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.25వేలు పెట్టుబడిగా పెట్టి నష్టపోయారని, మళ్లీ వరినాట్లు వేసుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తంచేశారు. నష్టపోయిన రైతులకు రూ.10వేలు ప్రకటించడం అన్యాయమని ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.


ముస్తాబాదలో జెండాలతో గ్రామోత్సవం చేస్తున్న ముజావర్లు

ఘనంగా ఉరుసు

గన్నవరం, సెప్టెంబరు 19: ముస్తాబాద మసీదు కొండపై ఉన్న ముస్తఫా వలీ అవులియా కరం వారి 59వ ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి హైస్కూల్ రోడ్డులోని మహబూబ్ సుభానీ జెండాల వద్ద గల ముజావర్ల ఇంటి నుంచి పకీర్ల ఖవాలీలు, మేళతాళాలతో బయలుదేరి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. జెండాలు పట్టుకుని గ్రామమంతా తిరిగి ఉదయం 5గంటలకు దర్గా వద్దకు ఉరుసు చేరి సందల్‌ను సమర్పించారు. దర్గా వద్ద దీపారాధన, అన్నదానం నిర్వహించారు.


సొసైటీ భూముల్లో ఇసుక మేటలను చూపుతున్న ఎస్సీ రైతులు

ఇసుక మేటలు తొలగించరూ

- ప్రభుత్వానికి చాగంటిపాడు ఎస్సీ రైతుల వేడుకోలు

తోట్లవల్లూరు, సెప్టెంబరు 19: ప్రభుత్వం తమకు జీవనాధారంగా ఇచ్చిన సొసై టీ భూములు కృష్ణానది వరదకు ఇసుక మేటలు వేసి పనికి రాకుండా తయారయ్యాయని, కరెంటు స్తంభాలు మొత్తం విరిగిపోయాయని, భూముల ధ్వంసంతో మళ్లీ సాగు చేయలేదని దుస్థితి ఏర్పడిందని చాగంటిపాడు ఎస్సీ సొసైటీ భూముల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మట్టా అమృతబాబు, నిమ్మకూరి భాస్కరరావు, నం దేటి డేవిడ్, నిమ్మకూరి బోస్ తదితర సొసైటీ రైతులు గురువారం మీడియాను తీసుకెళ్లి సొసైటీ భూములను చూపించారు. ఆర్‌ఎస్‌నెం 215/1ఎలో 70 ఎకరాలను ప్రభుత్వం ఎస్సీ సొసైటీకి ఇచ్చిందని, ఇందులో 130 మంది దళితులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారని అమృతబాబు తెలిపారు. మినుము, మొక్కజొన్న సాగు కోసం విత్తనాలు వేసిన పది రోజుల్లోనే వరద వచ్చి ఇసుక మేటలు వేసిందన్నారు. ఇసుక మేటలను తొలగించే శక్తి తమవద్ద లేదని, ప్రభుత్వం తొగింపునకు చర్యలు తీసుకోవాలని దళితులు కోరారు. సొసైటీ భూముల్లో 39 కరెంటు స్తంభాలు వరద తాకిడికి విరిగిపోయాయయని, విద్యుత్ సిబ్బంది ఒకసారి వచ్చి చూసి వెళ్లారని, నేటికీ ఒక్క స్తంభాన్ని కూడా లేపలేదన్నారు. గతంలో ఎస్సీ కార్పొరేషన్ సహాయంతో వేసిన 16 మోటార్లు పాడయ్యాయని భాస్కరరావు తెలిపారు. సొసైటీ భూముల్లో ఇసుక మేటల విషయాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా దృష్టికి కూడా తీసుకెళ్లామని అమృతబాబు వివరించారు. మళ్లీ భూములను సాగు చేసుకునేలా అభివృద్ధి చేయాలని దళిత రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఆలయాల్లో సామూహిక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్, సెప్టెంబరు 19: హిందూ సంప్రదాయాల్లోని గొప్పతనాన్ని అందరికీ తెలియజెప్పేందుకు ఆలయాల్లో సామూహిక పూజలు చేస్తున్నట్లు ధర్మప్రచారక్ యడవల్లి పాండు రంగారావు తెలిపారు. వేలేరు మద్దిరావమ్మతల్లి ఆలయం, కొయ్యూరు అమ్మవారి దేవాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాద్రపద పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు, సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించారు. వేలేరులో హారతి ప్రముఖ్ లక్ష్మి, కొయ్యూరులో సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ కన్వీనర్ మూలపూడి కేశవరావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

పెనమలూరు, సెప్టెంబరు 19: అనారోగ్యంతో బాధపడుతున్న వణుకూరు గ్రామానికి చెందిన దెందుకూరి శ్రీనివాసాచారి, కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామానికి చెందిన చొప్పకట్ల ధనలక్ష్మి ఆస్పత్రి ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఎల్వోసీ చెక్కులను మంజూరు చేయించారు. గురువారం పోరంకి టీడీపీ కార్యాలయంలో వారి కి చెక్కులను ఎమ్మెల్యే అందించారు. అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, సంగెపు రంగారావు, పీతా గోపీచంద్, సూదిమళ్ల రవీంద్ర, బొంగరాల అబ్రహాం పాల్గొన్నారు.


బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.45



ముఖ్యమంత్రి సహాయనిధికి మైత్రీ ఫౌండేషన్ రూ. లక్ష విరాళం



మచిలీపట్నం టౌన్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మచిలీపట్నం మైత్రీ ఫౌండేషన్ తరపున రూ.1,00,116 చెక్కును గురువారం సీఎం చంద్రబాబునాయుడుకు ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన మైత్రీ బృందాన్ని చంద్రబాబు అభినందించారు. మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు బి.బి.ఎస్. ప్రసాద్, కనకరాజు, దీప్తి, వక్కింటి రమాదేవి, పణి, అనిల్‌తో పాటు మంత్రి కొల్లు రవీంద్ర, శిష్టకర్ల టీడీపీ రాష్ట్ర సాధికార కన్వీనర్ అక్కుమహంతి రాజా తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ భూముల్లో ఇసుక మేటలను చూపుతున్న ఎస్సీ రైతులు



పడిపోయిన, విరిగిపడి పూడిపోయిన స్తంభాన్ని చూపుతున్న రైతులు

ఇసుక మేటలు తొలగించరూ..

● చాగంటిపాడు ఎస్సీ రైతుల వేడుకోలు

తోట్లవల్లూరు, సెప్టెంబరు 19 : ప్రభుత్వం తమకు జీవనాధారంగా ఇచ్చిన సొసైటీ భూములు కృష్ణానది వరదకు ఇసుక మేటలతో పనికి రాకుండా తయారయ్యాయని, కరెంటు స్తంభాలు మొత్తం విరిగిపోయాయని, భూముల ధ్వంసంతో మళ్లీ సాగు చేయలేదని దుస్థితి ఏర్పడిందని చాగంటిపాడు ఎస్సీ సొసైటీ భూముల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మట్టా అమృతబాబు, నిమ్మకూరి భాస్కరరావు, నందేటి డేవిడ్, నిమ్మకూరి బోస్ తదితర సొసైటీ రైతులు గురువారం మీడియాను తీసుకెళ్లి సొసైటీ భూములను చూపారు. ఆర్ఎస్‌నెం 215/1ఎలో 70 ఎకరాలను ప్రభుత్వం ఎస్సీ సొసైటీకి ఇచ్చిందని, ఇందులో 130 మంది దళితులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారని అమృతబాబు తెలిపారు. మినుము, మొక్కజొన్న సాగుకి విత్తనాలు వేసిన పది రోజుల్లోనే వరద వచ్చి ఇసుక మేటలు వేసిందన్నారు. ఇసుక మేటలను తొలగించే శక్తి తమ వద్ద లేదని, ప్రభుత్వం తొలగింపునకు చర్యలు తీసుకోవాలని దళితులు కోరారు. సొసైటీ భూముల్లో 39 కరెంటు స్తంభాలు వరద తాకిడికి విరిగిపోయాయయని, విద్యుత్ సిబ్బంది ఒకసారి వచ్చి చూసి వెళ్లారని, నేటికి ఒక్క స్తంభాన్ని లేపలేదన్నారు. గతంలో ఎస్సీ కార్పోరేషన్ సహాయంతో వేసిన 16 మోటార్లు పాడయ్యాయని భాస్కరరావు తెలిపారు. సొసైటీ భూముల్లో ఇసుక మేటల విషయా న్ని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా దృష్టికి కూడా తీసుకెళ్లామని అమృతబాబు వివరించారు. మళ్లీ భూములను సాగు చేసుకునే విధంగా అభివృద్ధి చేయాలని దళిత రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



తెలుగురావులపాలెం ఫీల్డ్ సొసైటీ రైతుల వినతి

ఘంటసాల : పంట పొలాల్లో ఇసుక మేటలు తొలగించాలని కోరుతూ సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు గురువారం తహసీల్దార్ బి.విజయప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ మండల పరిధిలోని తెలుగురావుపాలెం గ్రామంలోని ఆది ఆంధ్ర ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ నందు 160 మంది సభ్యులు శ్రీకాకుళం గ్రామంలో ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంతంలో లంక భూములు సాగు చేసుకుంటున్నారన్నారు. వరదకు లంక భూమిలో కొంత కోతకు గురైందని, మరి కొంత భూమి ఇసుక మేట వేసిందని, రైతులు పంటలు వేసుకోవటానికి ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఇసుక మేటలు తొలగించి సహకరించాలని కోరారు. లంకభూములకు ఈ-క్రాప్ నమోదు చేసి రైతులకు రైతు భరోసా కల్పించాలని కోరుతున్నామన్నారు. సొసైటీ అధ్యక్షుడు పెదముత్తేవి వసంతరావు, మాజీ సర్పంచ్ ఆరుంబాక రవి, సభ్యులు ఎం.శేఖర్, జె.కోటేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, రాచూరి భాస్కరరావు, బుర్రె నాగమల్లేశ్వరరావు, పెదపూడి దాసు, జె.ఏసుదాసు సంతకాలతో వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.



మొక్క నాటుతున్న టీడీపీ సీనియర్ నేత గోపీచంద్



బందరులో స్వచ్ఛతా సేవ ర్యాలీలో కమిషనర్



అవనిగడ్డలో స్వచ్ఛతా సేవ ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ తదితరులు

పచ్చదనం - పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 19 : పచ్చదనం పరిశుభ్రతతోనే మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా 45వ డివిజన్‌లో మొక్కలు నాటారు. ట్రాఫిక్ ఎస్సై ఎస్. వెంకటేశ్వరరావు, సచివాలయ అడ్మిన్ అల్లాభక్షు పాల్గొన్నారు. బందరును సుందర నగరంగా తీర్చిదిద్దుదామని మచిలీపట్నం నగర కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు అన్నారు. కోనేరు సెంటర్‌లో స్వచ్ఛతా హి సేవ ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మం గినపూడి బీచ్‌లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక ప్రతిమలతో నిండిపోయిన బీచ్‌ను శుభ్రపరిచారు. 30 కిలోల ప్లాస్టిక్ వస్తువులను ఏరి పంచాయతీ అధికారులకు అప్పగించారు. తాళ్లపాలెం టీడీపీ నాయకులు కొనకళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. **పెడన :** భట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత - పర్యావరణ పరిరక్షణపై గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థులచే స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ చేయించారు. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కమిషనర్ ఎం. గోపాలరావు, కౌన్సిలర్లు పిచ్చిక సతీష్, కటకం ప్రసాద్, మునిసిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు. **గుడివాడ రూరల్ :** ఈవోపీఆర్డీ డి.వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ తదితరుల ఆధ్వర్యంలో బొమ్ములూరు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం జరిగింది. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు స్వచ్ఛత కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. **ఘంటసాల :** ఎంపీడీవో శ్రీనివాస్ చంద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయాల వద్ద, సంపద సృష్టి కేంద్రాల వద్ద అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు. ఘంటసాల పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు. చిట్టూర్పు, కొడాలి గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్‌లు గూడపాటి వెంకటేశ్వరరావు, చలపాటి రాణి, కార్యదర్శులు శ్రీలక్ష్మి కృష్ణవేణి, సిహెచ్.వి.ఎస్.నాగమణి తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛతా హి సేవ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ తుంగల సుమతి, ఈవోపీఆర్డీ కమ్మిలి త్రిపుర సుందరి, అవనిగడ్డ ఈవో తోట శ్రీనివాసరావు, పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **నాగాయలంక :** సంగమేశ్వరం గ్రామపంచాయతీ తుఫాన్ బిల్డింగ్ స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించారు. గ్రామసర్పంచ్ నాయుడు నాగమల్లేశ్వరి, ఎంపీడీవో జెకె.సీతారామ కుమార్, ఈవోపీఆర్డీ కె.అప్పల నరసయ్య, పంచాయతీ కార్యదర్శి నల్లూరి సాయికృష్ణ, సచివాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, హెల్త్ డిపార్ట్‌మెంట్‌క్ష వారు, డ్వాక్రా మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



బొమ్ములూరులో స్వచ్ఛతా సేవ ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు



సంగమేశ్వరంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

మోటూరు దేవస్థానం భూముల కౌలు వేలం నవంబరు 19న

గుడివాడ రూరల్ : మోటూరు సీతారామ స్వామి దేవస్థానం భూములకు కౌలు వేలం పాట నవంబరు 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ గొరిపర్తి నాగమౌనిక గురువారం తెలిపారు. రూరల్ మండల పరిధిలో ఐదు ఎకరాలకు పైగా ఉన్న పొలానికి నవంబరు 19వ తేదీన ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాల్సిందిగా కోరారు. వేలం పాట పాడుకున్న వారు మూడు సంవత్సరాల వరకు కొనసాగుతారని ఆమె పేర్కొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన పర్వతనేని వెంకట శివ కోటేశ్వరరావు, లక్ష్మీ రాణి దంపతులు 50,001 విరాళంగా అందజేశారు. గురువారం కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. విరాళం మొత్తాన్ని ఆలయ ఉద్యోగులకు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోడూరు : పోటుమీద గ్రామ సమీపంలో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఎనిమిది మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.3 వేల నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.శిరీష తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

నాగాయలంక : సొర్లగొంది గ్రామానికి చెందిన కొప్పనాతి వెంకటేశ్వరరావు నాగాయలంక నుంచి మద్యం తీసుకెళ్తుండగా 24 సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.



మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడిగా నాగ రమేష్ ఏకగ్రీవం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 19 : జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ నాగ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.విజయకుమార్ గురువారం నామినేషన్లను పరిశీలించి అధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ నాగరమేష్, ఉపాధ్యక్షుడిగా విష్ణుమూర్తుల శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా కర్రి కృష్ణమూర్తి, నిమ్మగడ్డ ఏసుబాబు, పత్తిపాటి కోటయ్య, మోకా విష్ణువర్ధన రావు, మోకా వెంకటేశ్వరరావు, లంకే బాలభాస్కర్, వల్లభనేని సురేష్, వల్లభు పరమేశ్వరరావు, వెలగాడ పాపారావు ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నాగరమేష్‌ను పలువురు గజమాలలతో సత్కరించారు. జాయింట్ డైరెక్టర్ ఎ. చంద్రశేఖర్, పర్సన్ ఇన్‌చార్జి ఆర్. ప్రతిభ, సిహెచ్. రమేష్ ఈ ఎన్నికను పర్యవేక్షించారు. ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, మోటమర్రి బాబాప్రసాద్, లంకే హరి, ఊకంటి రాంబాబు, లంకే నారాయణ ప్రసాద్, కుంచే నాని, లంకే హరికృష్ణ, నాగాంజనేయులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుడు వీరంకి వెంకటేశ్వరరావుకు సత్కారం

పమిడిముక్కల : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న వీరంకి వెంకటేశ్వరరావును ఎంఈవో ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. పమిడిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కేశవ నారాయణ అధ్యక్షతన జరిగి కార్యక్రమంలో వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. విద్యాభివృద్ధికి వెంకటేశ్వరరావు చేస్తున్న కృషిని కొనియాడారు. మండల పరిధి పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.



గర్భిణులకు సామూహిక సీమంతం

పామర్రు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆందోళనలకు దూరంగా ఉండాలని పామర్రు ఐసీడీఎస్ సీడీపీవో భానుశ్రీ పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి మత్స్య సంపద యోజన పథకం నిధులు ఇవ్వాలి

అవనిగడ్డ : వరదలు, తుఫాన్లతో ఆర్థికంగా నష్టపోతున్న మత్స్యకారులకు ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం మిగులు నిధులతో రుణ సదుపాయం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అవనిగడ్డ మత్స్యభవనం వద్ద గురువారం విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 2024కు మత్స్యసంపద యోజన నిధులు కేంద్ర ప్రభుత్వం వెనుకకు తీసుకునే అవకాశం ఉన్న దృష్ట్యా మిగులు నిధులతో వలలు, ఐస్ బాక్సులు, మోటారు వెహికిల్స్ వంటి వాటికి మత్స్యకారులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. నాగిడి శివనాగేశ్వరరావు, నాగిడి అమలేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి చంద్రబాబు : మోర్ల

చల్లపల్లి, సెప్టెంబరు 19 : రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్ పునర్వ్యస్థీకరణ, బీసీ రక్షణ చట్టానికి రూపకల్పనకు ముఖ్యమంత్రి ఆదేశించటం పట్ల టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మోర్ల ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీలకు చట్టసభల్లో సమానమైన ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో వారికి 33 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రతిపాదనలను కేంద్రం ఆమోదానికి పంపాలని నిర్ణయించటం ద్వారా చంద్రబాబు బీసీల పక్షపాతి అని నిరూపించుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో 3736 మద్యం దుకాణాల్లో కల్లు గీత కార్మికులకు 10 శాతం కేటాయించటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. 100 మంది బీసీ విద్యార్థులతో ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటు, బీసీ స్టడీ సర్కిళ్ల బలోపేతానికి రూ.10 కోట్లు కేటాయించటం, 23 జిల్లా కేంద్రాల్లో బీసీ భవన నిర్మాణానికి స్థలాలు గుర్తించి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించటం తదితర కార్యక్రమాల కోసం ముఖ్యమంత్రి, క్యాబినెట్ నిర్ణయించటం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

మునిపెడ యువకుడి దుర్మరణం

● కుటుంబానికి ఎమ్మెల్యే కాగిత పరామర్శ

కృత్తివెన్ను : మచిలీపట్నంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మునిపెడ గ్రామానికి చెందిన లోచర్ల పరమేశ్వరరావు (26) దుర్మరణం చెందాడు. హైదరాబాద్‌లో ఉంటున్న పరమేశ్వరరావు హైదరాబాద్ నుంచి మునిపెడ వస్తుండగా మచిలీపట్నం కోతి బొమ్మ సెంటర్ వద్ద లారీ ఢీకొంది. పరమేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. పరమేశ్వరరావు భౌతికకయాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ గురువారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. టీడీపీ నాయకులు ఒడుగు తులసీరావు, పిన్నెంటి రత్తయ్య, ఘంటా రాంబాబు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

మచిలీపట్నం టౌన్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహారాష్ట్ర శివసేన షిండే వర్గం ఎమ్మెల్యే సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. మొవ్వ మోహనరావు, అబ్దుల్ మతీన్, వి. సుబ్రహ్మణ్యం, కోకా ఫణిభూషణ్, చంద్రశేఖర్, సయ్యద్ నూరుద్దీన్, మహమ్మద్ ఆరీఫ్ పాల్గొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

కోడూరు : విద్యార్థినీ, విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఏఎన్ఎం పి.సుజాత తెలిపారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కోడూరు జిల్లా పరిషత్ పాఠశాల 8, 9 తరగతుల కిశోర బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల నిషేధ చట్టం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. నాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాల్లో సౌకర్యాలపై ఆరా

గుడ్లవల్లేరు : బీసీ సంక్షేమ వసతిగృహాల్లో వసతులు, సదుపాయాలపై నివేదిక అందజేసేందుకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పీఏ గురువారం గుడ్లవల్లేరు మండలంలోని బీసీ సంక్షేమ వసతి గృహాలను పరిశీలించారు. ఆర్ఐ షకీలా బేగం ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు, అంగలూరు బీసీ సంక్షేమ వసతిగృహాలను ఎమ్మెల్యే రాము పీఏ సుజిత్ పరిశీలించారు. రికార్డులను కూడా పరిశీలించారన్నారు. సుజిత్‌తో పాటు వీర్వో ప్రకాష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోరంబోకు భూములు ఆక్రమిస్తే చర్యలు

మచిలీపట్నం టౌన్ : నగర పాలక సంస్థ పరిధిలో కుమ్మరిగూడెం ఏరియాలో మడుగుపోరంబోకు భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు హెచ్చరించారు. కొందరు మడుగు పోరంబోకను ఆక్రమిస్తున్నారని, ఆక్రమణదారులు వెంటనే స్వచ్ఛందంగా తాము వేసుకున్న ఇళ్లను తొలగించాలన్నారు. తొలగించకపోతే యంత్రాలతో తొలగిస్తామని, అందుకయ్యే ఖర్చును ఆక్రమణదారుల నుంచి వసూలు చేస్తామన్నారు. జల వనరుల రక్షణ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖుడి నేత్రదానం

కోడూరు : ప్రముఖ వ్యాపారి, ఆర్యవైశ్య ప్రముఖుడు రేషన్ డీలర్ ఇమ్మడి రాంబాబు (59) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. తండ్రి ఆశయాల మేరకు కుమారుడు వంశీకృష్ణ అంగీకారంతో విజయవాడ ఎల్.వి. ప్రసాద్ కంటి వైద్య బృందం కార్నియాను సేకరించారు. రాంబాబు భౌతిక కాయాన్ని ఆర్యవైశ్య ప్రముఖులు, రాజకీయ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

అవనిగడ్డ : రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఏ.వీరకుమారి ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అంకారావు అధ్యక్షతన విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు వంగర శేషగిరిరావు సీపీఆర్ విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన ఉండాలన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంగ్లీషు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బంటుమిల్లి : బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు బోధించుటకు గెస్ట్ లెక్చర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ ఇంగ్లీషు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. అనుభవం ఉన్న అధ్యాపకులకు ప్రాధాన్యతనిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 21వ తేదీ సాయంత్రం 4గంటల లోగా కళాశాలలో అందజేయాలన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 23వ తేదీ 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూ, డెమోకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10వేలు గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు.

కమ్యూనిటీ భవనం, దోబీఖానాకు స్థలం కేటాయించండి

చల్లపల్లి : పాగోలు గ్రామంలోని సర్వే నెంబరు 429లోని సీలింగ్ భూమిలో దోబీఖానా, రజక సంఘం కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ పాగోలు రజక సంఘం ప్రతినిధులు తహసీల్దార్ డి.వనజాక్షికి గురువారం వినతిపత్రం అందజేశారు. పాగోలు గ్రామంలో సుమారు 170 మంది రజక కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. కులవృత్తిపై ఆధారబడి జీవించే రజకులకు కమ్యూనిటీ భవనం, దోబీఖానాలు లేవన్నారు. సీలింగ్ భూమి 20 సెంట్లు కమ్యూనిటీ భవన నిర్మాణానికి, 10 సెంట్లు దోబీఖానాకు కేటాయించాలనీ, గ్రామ పంచాయతీ తీర్మానం చేసేలా చొరవ చూపాలని కోరారు.

వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం



మొవ్వ, నాగాయలంకలో నిమజ్జనోత్సవానికి తరలివెళ్తున్న గణనాథులు

కూచిపూడి : గణేష్ నిమజ్జన వేడుకలు గురువారం పలు గ్రామాల్లో కోలాహలంగా జరిగాయి. కూచిపూడి, పెదపూడి, మొవ్వ తదితర గ్రామాల్లో గురువారం గణనాథులను పంట కాలువలు, కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. గణనాథుల ఊరేగింపు సందర్భంగా గ్రామాలు కోలాహలంగా మారాయి. అయితే, పోలీసు ఆదేశాలను బేఖాతరు చేస్తూ గణేష్ నిమజ్జన వేడుకల్లో బాణాసంచా వేడుకలు, డిజే సౌండ్ సిస్టమ్‌ల మోతతో ఊరేగింపు నిర్వహించటం పలువురిని అసహనానికి గురి చేసింది. **నాగాయలంక :** ప్రసన్న గణపతి ఉత్సవ పందిరిలో వినాయకుడి నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. గణనాథుడికి అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం నాగాయలంక కృష్ణానదిలో వినాయకుడిని జయజయ ధ్వానాల నడుమ నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు మండవ బాలవర్ధిరావు, తాడికొండ సత్యనారాయణ, చిట్టా సాంబశివరావు, నారాయణరావు, ఆలూరి శ్రీనివాసరావు, తలశిల తాతయ్య, గడ్డిపాటి ప్రసాదరావు, నాగిడి తాతారావు, తోపుల బాబురావు, మానేపల్లి శ్రీనివాసరావు, చిట్టా హరికృష్ణ, గోలి కోటేశ్వరరావు, లంకే శ్రీనివాస ప్రసాద్, బండ్రెడ్డి సుబ్బారావు, విస్సంశెట్టి రాము, సుఖవాసి యుగంధర్, వేములపల్లి హేమ ప్రసాద్, తలశిల రామకృష్ణ, ఉప్పల బుజ్జి, బోయపాటి రాము తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** మోపిదేవిలంక గ్రామంలో గణేష్ నిమజ్జనోత్సవ ర్యాలీ వైభవంగా నిర్వహించారు డప్పు కళాకారుల విన్యాసాలతో పురవీధుల్లో యువతీ, యువకుల ఆనందోత్సాహాల నడుమ మోపిదేవి వార్పు వద్ద ఉన్న కృష్ణానదిలో గణనాథుని నిమజ్జనోత్సవం గావించారు.